సాక్షి
శ్రీకాకుళం
బుధవారం : 24 : సెప్టెంబర్ : 2025



ఆయువు తీస్తూ..

జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇది ప్రమాదకరంగా మారుతోంది. - 8లో



మాజీ ఎమ్మెల్యే కిరణ్ సవాల్

బీజేపీ ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ సవాల్ విసిరారు. ఎమ్మెల్యే అక్రమాలన్నీ నిజమేనన్నారు. - 8లో

వర్సిటీకి దసరా సెలవులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు ఈ నెల 25 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకూ దసరా సెలవులు ఇస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య తెలిపారు. వచ్చే నెల 9వ తేదీన తిరిగి తరగతులు ప్రారంభమవుతాయని తెలియజేశారు.



దాండియా నైట్స్

రాజస్థానీ మిలన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం టౌన్ హాలులో మంగళవారం రాత్రి దాండియా వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజస్థానీలు కుటుంబ సమేతంగా దాండియా ఆడుతూ సందడి చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్









● అవతార రూపిణి

శరన్నవరాత్రుల శోభ కొనసాగుతోంది. రెండో రోజు మంగళవారం అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. శ్రీకూర్మంలోని వైష్ణవీ దుర్గకు ఇలా పూజలు చేశారు. అలాగే శ్రీకాకుళంలోని బాలాత్రిపుర కాలభైరవ పీఠంలో బాలాకుమారి పూజలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

నిబంధనలు కాలరాసి..

పౌర సేవకు కేరాఫ్‌గా ఉండాల్సిన సచివాలయం బెదిరింపులకు నిలయమవుతోంది. సచివాలయం జారీ చేసిన ధ్రువీకరణ పత్రంపై ఆరోపణలు రావడం, ఉద్యోగికి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి బెదిరించడం వంటివి సచివాలయ వ్యవస్థలో కొత్త లోపాలను బహిర్గతం చేస్తున్నాయి. ఇప్పుడీ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లింది. జలుమూరు మండలం జోనంకి సచివాలయం ఈ వివాదానికి వేదికైంది.



- జోనంకిలో నిబంధనలకు విరుద్ధంగా మరణ ధ్రువీకరణ పత్రం జారీ
- టీడీపీ నాయకుల ఒత్తిడితోనే సర్టిఫికెట్ మంజూరు!
- సెలవులో ఉన్న కార్యదర్శి డిజిటల్ సైన్‌తో పత్రం
- అదే సాకుతో సైబర్ క్రైమ్ కమిషనర్‌ను అంటూ అజ్ఞాత వ్యక్తి బెదిరింపు
- ఆ వ్యక్తికి రూ.1.20 లక్షలు డిజిటల్ పేమెంట్ చేసిన కార్యదర్శి
- అయినా ఆగని వేధింపులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన కార్యదర్శి

జలుమూరు: జోనంకి సచివాలయంలో నిబంధనలకు విరుద్ధంగా మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జోనంకి పంచాయతీకి చెందిన ధవళ అప్పలనాయుడు మే 22న విశాఖలో అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. కానీ స్థానికంగా జోనంకిలో మృతి చెందినట్లు కార్యదర్శి గుడ్ల సరోజిని డిజిటల్ సైన్‌తో మరణ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యింది. అయితే సరోజిని ఏప్రిల్ నుంచి జూన్ వరకూ సెలవులో ఉన్నారు. ఇదే సమయంలో లింగాలవలస సచివాలయం కార్యదర్శి ఎం.లక్ష్మి జోనంకి పంచాయతీకి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈమె అప్పలనాయుడు మరణ ధ్రువీకరణ పత్రం సరోజిని డిజిటల్ సైన్‌తో మంజూరు చేశారు. దీంతో వివాదం మొదలైంది. స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్ మంజూరు చేశారని స్థానికులు చెబుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ హరి ఈ పత్రానికి సంబంధించి ఫార్మ్-2ను అప్‌లోడ్ చేసి సిస్టమ్ ద్వారా అందించారు. అయితే సెలవులో ఉన్న కార్యదర్శి పేరిట ధ్రువీకరణ పత్రం ఇవ్వకూడదు. హరి మాట్లాడుతూ తనకు లింగాలవలస కార్యదర్శి అప్పల నాయుడు సర్టిఫికెట్‌కు సంబంధించిన ఓటీపీ చెబితే ఇచ్చానని, తనకు అంతవరకే తెలుసని వివరించారు. దీనిపై లింగాలవలస కార్యదర్శి లక్ష్మీ మాట్లాడుతూ అదేం పెద్ద తప్పు కాదని, అప్పల నాయుడు స్థానికంగా మృతి చెందినట్లు వంద మంది సంతకాలు తన వద్ద ఉన్నాయని చెప్పడం విశేషం.



జోనంకి సచివాలయం

సైబర్ కమిషనర్ అంటూ రూ.1.20 లక్షలు వసూలు..

సెలవులో ఉన్న ఉద్యోగి పేరుతో పత్రం రిలీజ్ కావడంతో ఓ అజ్ఞాత వ్యక్తి తాను సైబర్ కమిషనర్‌ను అంటూ కార్యదర్శి సరోజినికి ఫోన్ చేశాడు. 'మీరు సైబర్ క్రైమ్‌లో ఇరుక్కున్నారు. మీ సంతకంతో లింగాలవలస కార్యదర్శి లక్ష్మి విశాఖలో మృతి చెందిన వ్యక్తికి ఇక్కడ మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. మీ మీద పోలీసు కేసు నమోదవుతుంది. మీరు కోర్టులకు తిరగాల్సి వస్తుంది. త్వరలో అరెస్ట్ అవ్వనున్నారు' అని బెదిరించారు. దాదాపు నాలుగు గంటల పాటు ఇలా వేధింపులు రావడంతో ఆమె భయపడ్డారు. దీని నుంచి తప్పించుకోవాలంటే తమ ఫోన్‌కు పెద్ద మొత్తంలో డబ్బు పంపాలని కార్యదర్శి సరోజినికి ఫోన్ రావడంతో ఆమె ఈ నెల 11న రూ.1.20 లక్షలు ఫోన్ పే చేశారు. అయినా మళ్లీ డబ్బు డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఈ సోమవారం ఎస్పీ మహేశ్వర రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో జలుమూరు పోలీసులు కేసు ను ప్రత్యేకంగా దర్యాప్తు చేసి రూ.1.20 లక్షలు నగదు ఫోన్‌పే చేసిన ఫోన్‌ను హోల్డ్‌లో పెట్టినట్లు సమాచారం. ఇదే పంచాయతీలలో నాలుగేళ్ల కిందట ఏటీఎం మార్చి డబ్బు కొట్టేశారు. మళ్లీ ఇలా జరగడంతో స్థానికుల ప్రమేయం ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఏటీఎం మార్చి నగదును దొంగిలించిన వ్యక్తి ఒకరైతే మరో వ్యక్తిని అప్పట్లో పోలీసులు విచారించారు. దొంగలించిన వ్యక్తి తప్పు జరిగిందని అందులో కొంత నగదు తిరిగి ఇవ్వడంతో ఆ వివాదం సద్దు మణిగింది. ఈ అంశంపై సర్పంచ్ జీవీ రమణి మాట్లాడుతూ తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ, కార్యదర్శి నుంచి డబ్బులు వసూలు వంటి అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

రెప్పపాటులో..

- పిడుగు పాటుకు ఇద్దరు మహిళలు మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



పొలంలో పిడుగు పాటుకు మృతిచెందిన భార్య పద్మావతి మృతదేహం వద్ద రోదిస్తున్న కృష్ణారావు (ఇన్‌సెట్లో) మృతురాలు పద్మావతి (ఫైల్)

పోలాకి: రెప్పపాటు కాలంలో రెండు నిండు ప్రాణాలు పోయాయి. పిడుగుపాటుకు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు మరణించారు. మంగళవారం సాయంత్రం ఉర్జాం గ్రామానికి చెందిన కణితి పద్మావతి(55) తన భర్త కృష్ణారావుతో కలసి పొలం పనులు చేస్తుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పక్కన ఉన్న భర్త పిడుగుధాటికి స్పృహ తప్పి కుప్పకూలిపోయాడు. కాసేపటి తర్వాత తేరుకున్నప్పటికీ ఏం జరిగిందో అర్థం కాక అక్కడే ఉండిపోయా రు. తర్వాత పక్కనే చలనం లేకుండా పడి ఉన్న పద్మావతిని చూసి నిశ్చేష్టులయ్యారు. స్థానికులకు విషయం చెప్పడంతో వారు వచ్చి చూసే సరికి పద్మావతి ఊపిరి వదిలేశారు. పంటపొలంలో భార్య మృతదేహం పక్కన రైతు కృష్ణారావు రోదించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆర్.కరాపాడులో



ఊర్వశి (ఫైల్)

కవిటి: మండలంలోని ఆర్.కరాపాడులో మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లిన రెయ్యి ఊర్వశి (39) అనే మహిళ పిడుగుపాటుకు గురై మృతిచెందినట్టు కవిటి ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. కంచిలి మండలం జాడుపూడికి చెందిన ఈమె పొరుగు గ్రామమైన ఆర్.కరాపాడులో పంటపొలంలో కలుపు తీసేందుకు మరో ముగ్గురుతో కలిసి వెళ్లింది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగు పడి ఆమె మరణించింది. ఆమెతో పాటు మిగిలిన వారు ఈ ప్రమాదంలో గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారని ఆయన తెలిపారు.

పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణానికి వేలం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఉన్న పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పదో దుకాణం వేలం పద్ధతిలో అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉందని ఎస్పీ మహేశ్వరరెడ్డి మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకుని ఈనెల 25న కార్యాలయం ఆవరణలో జరుగు వేలంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్‌కు 6309990841కు డయల్ చేయాలన్నారు.

ఒక మెసేజ్‌తో తొలగించేస్తారా..?

- ఉద్దానం తాగునీటి పథకం ఉద్యోగుల తొలగింపుపై ఎమ్మెల్సీ నర్తు రామారావు మండిపాటు
- ఇదేనా అనుభవజ్ఞుని పాలన అంటూ శాసన మండలిలో చర్చ
- తొలగించిన 104 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి : సుమారు 28 ఏళ్లుగా ఉద్దానం తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల తొలగింపు దారుణమని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. మంగళవారం శాసనమండలి, మీడియా పాయింట్ వేదికగా ఈ సమస్యను ప్రస్తావించారు. ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారం దక్కాక ఉన్నవి తీసేస్తున్నారని దుయ్యబట్టారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న వారిని ఒకే మెసేజ్‌తో రాత్రికి రాత్రి తొలగించడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. 104 కుటుంబాలు ఆ ఒక్క మెసేజ్‌తో రోడ్డున పడ్డాయన్నారు. తొలగించిన ఆ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకుని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇదేనా అనుభవజ్ఞుడి పాలన..?

దశాబ్దాలుగా పనిచేస్తున్న వారిని తొలగించడమే విజనరీయా, ఇదే అనుభవజ్ఞుడి పాలనా అంటూ నర్తు ప్రశ్నించారు. ఉద్యోగాలు కోల్పోయి 45 రోజులుగా ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్న ఆ కార్మికులకు ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. జిల్లాలో పదిమంది ఎమ్మెల్యేలు, ఒక ప్రభుత్వ విప్, రాష్ట్ర, కేంద్ర మంత్రి ఉండి ఆ 104 మంది కార్మికులను ఆదుకోలేరా అని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్‌లో ఉన్న వారిని తీసుకువెళ్లి, మెగా సంస్థలో విలీనం చేసి నాలుగు నెలల్లోనే వారిని విధుల్లో నుంచి తొలగించడం అన్యాయమన్నారు.

కార్మికుల తరఫున వైఎస్సార్ సీపీ న్యాయ పోరాటం

ఆ కార్మికుల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ అంశంపై వైఎస్ జగన్ వెంటనే స్పందించి పార్టీ లీగల్ టీమ్ ప్రతినిధి మనోహర్ రెడ్డికి ఈ బాధ్యతలను అప్పగించినట్లు నర్తు చెప్పారు. ఆ 104 మంది కుటుంబాల భవిష్యత్ కోసం లీగల్‌గా న్యాయపోరాటం చేయాలని వైఎస్ జగన్ ఆదేశించారన్నారు.

ఉద్యమకారుల ఆవేదన అర్థం చేసుకోండి

థర్మల్ ఉద్యమకారులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని నర్తు రామారావు కోరారు. విరామ సమయంలో శాసనమండలి ప్రాంగణంలో తనను కలిసిన పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ యారాడ కృష్ణమూర్తిని, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను, శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు వద్దకు తీసుకువెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సవం.. ఉత్సాహం

- వైభవంగా కొత్తమ్మ తల్లి జాతర ప్రారంభం



విద్యుత్ వెలుగుల్లో కొత్తమ్మ తల్లి ఆలయ ప్రాంగణం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి శతాబ్ది జాతర ఉత్సవాలు మంగళవారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అమ్మతల్లి గుడిలో ఉన్న అమ్మవారి జంగిడిని అసాదీల కుటుంబీకుల పెద్ద తలపై పెట్టుకుని అమ్మతల్లికి నిలయమైన రెడ్డిక వీధికి చెందిన కమ్మకట్టు చిన్న అప్పలనాయుడు ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వెంట పేరంటాళ్లు వెళ్లారు. సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కల్లి విశ్వనాథరెడ్డి తదితరులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ జంగిడిని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రెడ్డిక వీధి నుంచి పసుపు కలశాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి మళ్లీ కొత్తమ్మ తల్లి ఆలయంలో ఉంచి పూజలు నిర్వహించి అమ్మవారి దండకం చదివి కొత్త చీరను మొక్కుగా చెల్లిస్తారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రు లు జెండా ఊపి ప్రారంభించారు. సెంటర్ లైటింగ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పాల్గొన్నారు.

క్రైమ్ బృందాలతో ప్రత్యేక నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : కోటబొమ్మాళిలో జరుగుతున్న కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భద్రతా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ మహేశ్వరరెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. సుమారు 100 సీసీ కెమెరాలు, 6 డ్రోన్ కెమెరాలు, 10 ఎల్ఈడీ తెరలను కంట్రోల్ రూమ్‌నకు అనుసంధానం చేశామన్నారు. పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా తక్షణ ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని, తప్పిపోయిన పిల్లలు, వస్తువుల ట్రేసింగ్ కోసం ప్రత్యేక కంట్రోల్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.



వేడుకలో మంత్రులు, కలెక్టర్

4 రోజులు భారీ వర్షాలు

- జిల్లాపై వాయుగుండం ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుండటంతో రానున్న నాలుగు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఈ సూచనలు చేశారు. ఈనెల 26వ తేదీ నాటికి అల్పపీడనం వాయుగుండంగా బలపడి, అదే రోజు దక్షిణ ఒడిశా– ఉత్తరాంధ్ర తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్‌లో 08942- 240557 నంబర్‌తో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పశువులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, అలాగే మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఆయన స్పష్టం చేశారు. వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై వచ్చిన ప్రజాభిప్రాయ సర్వే నివేదికలను కూడా సమీక్షించారు.

క్లుప్తంగా

నేడు కబడ్డీ ఎంపికలు

ఎచ్చెర్ల: కర్ణాటక రాష్ట్రం బెల్గావిలో అక్టోబర్ 4 నుంచి నిర్వహించనున్న సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే వర్శిటీ జట్టు ఎంపికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వర్శిటీ, అనుబంధ కళాశాలల క్రీడాకారులు వర్శిటీ ఆవరణలో జరిగే ఎంపికలకు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి సెపక్‌తక్ర జట్ల ఎంపికలు



సాధన చేస్తున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సెపక్‌తక్ర జట్ల ఎంపికలు ఈ నెల 24న జరుగుతాయని సంఘ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. విజేతలు సెపక్‌తక్ర జిల్లా సెక్రటరీ జి.అర్జున్‌రావురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్–2025 పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వివరాలకు 9949291288 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వార్షిక క్రీడా షెడ్యూల్‌కు ఆమోదం



మాట్లాడుతున్న వీసీ కె.ఆర్.రజినీ

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా కార్యక్రమాలపై మంగళవారం స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో చర్చించారు. వార్షిక క్రీడా షెడ్యూల్‌కు ఆమోదం తెలిపారు. పీఎం–ఉషా నిధులు ఉపయోగించుకుని క్రీడా సంబంధిత అంశాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్ రజినీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రా యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం బీఓఎస్ చైర్మన్ ఎన్.విజయమోహన్, బీఆర్ఏయూ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయభాస్కర్, ఎస్‌వో సామ్రాజ్యలక్ష్మీ, పి.రవికుమార్, పీడీలు ఎం.శ్రీనివాసరావు, వి.భాస్కర్, ఎన్.లోకేశ్వరి, టి.సంతోష్, పావని, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

పీజీ సెట్ ప్రవేశాల సీట్లు జాబితా విడుదల



ఎచ్చెర్ల : ఏపీ పీజీ సెట్–2025 ప్రవేశాలకు సంబంధించి సీట్లు, కళాశాలల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ పీజీ కళాశాలల్లో సీట్లు భర్తీకి ఈ ఏడాది జూన్ 9 నుంచి 12 వరకూ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 20 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాల జాబితా విడుదల చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23 నుంచి 27 వరకూ ఆయా వర్శిటీలు, కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. వర్శిటీలో తొమ్మిది సైన్స్, పది ఆర్ట్స్ కోర్సుల్లో మొత్తం 600 సీట్లు ఉండగా 252 సీట్లు భర్తీ అయ్యాయి. కొత్తగా ప్రారంభించిన జియోఫిజిక్స్, జియాలజీ కోర్సులతో పాటు ఎంజేఎంసీలో ఎవరూ చేరలేదు. ఫిలాసఫీలో ఒక్కరు మాత్రమే చేరారు.

బీఆర్ఏయూలో ప్రవేశాలు ఇలా..

కోర్సు	మొత్తం సీట్లు	భర్తీ సీట్లు
ఎంఏ ఫిలాసఫీ	20	1
జియోఫిజిక్స్	15	0
జియాలజీ	15	0
ఎంజేఎంసీ	30	0
సోషల్‌వర్క్	40	04
అర్థశాస్త్రం	40	08
ఎంఎల్ఐఎస్‌సీ	40	08
రూరల్ డెవలప్‌మెంట్	40	11
ఎం.కాం	40	27
ఆంగ్లం	40	24
తెలుగు	40	16
ఎంఈడీ	40	17
బయోటెక్నాలజీ	30	29
మైక్రో బయాలజీ	20	21
ఆర్గానిక్ కెమిస్ట్రీ	30	31
ఎనలాటికల్ కెమిస్ట్రీ	20	20
గణితం	40	14
అప్లయిడ్ మ్యాథ్స్	20	11
భౌతిక శాస్త్రం	40	15

ఆగి ఉంటూ.. ఆయువు తీస్తూ!



దేవాది వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు

- జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్
- ఆగి ఉన్న వాహనాలను ఢీకొడుతున్న ఇతర వాహనాలు
- నిర్దేశిత స్థలం కేటాయిస్తున్నా పట్టించుకోని డ్రైవర్లు

నరసన్నపేట:

కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యం మరికొన్ని కుటుంబాలకు తీరని శోకం మిగుల్చుతోంది. జాతీయ రహదారులపై వాహనాల పార్కింగ్ నిర్దేశిత ప్రదేశాలు కేటాయిస్తున్నా.. అక్కడ కాకుండా తమకు ఇష్టం వచ్చినచోట గంటల తరబడి వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వాటిని గమనించని ఇతర వాహనాల డ్రైవర్లు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఆందోళనలో స్థానికులు..

నరసన్నపేట మండల పరిధిలో పలు గ్రామాల వద్ద జాతీయ రహదారిపై భారీ వాహనాలు, లారీలు ఎక్కడికక్కడ పార్కింగ్ చేస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మడపాం, దేవాది, తామరాపల్లి, జమ్ము కూడలిలలో వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఆదివారం దేవాది కూడలి సమీపంలో ఓ దాబా ముందు లారీ ఆగి ఉన్నా.. గమనించని కారు డ్రైవర్ ముందున్న ద్విచక్ర వాహనాన్ని గుద్దుకుంటూ లారీని బలంగా ఢీకొట్టారు. దీంతో లారీ కిందకు కారు ముందు భాగం దూసుకెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులతో పాటు కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. లారీ అక్కడ ఆగి ఉండకపోతే ప్రమాదం జరిగి ఉండేదికాదని స్థానికులు అంటున్నారు. అలాగే దేవాది ఫ్లై ఓవర్ వంతెనపై మూడు నెలల క్రితం ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో అదే గ్రామానికి చెందిన కృష్ణ మృతి చెందాడు. ఈ విధంగా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పెట్రోలింగ్ సిబ్బంది చర్యలేవీ?

ఎన్‌హెచ్ పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యమే ఈ ప్రమాదాలకు కారణమని విమర్శలు వస్తున్నాయి. ఇష్టారాజ్యంగా జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. మంగళవారం కోమర్తి–మడపాం మధ్య జాతీయ రహదారిపై పలు వాహనాలు పార్కింగ్ చేయడం కనిపించింది. ఇప్పటికైనా పెట్రోలింగ్ సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..

జాతీయ రహదారిపై అధికారికంగా శ్రీకాకుళం నుంచి కోటబొమ్మాళి మధ్య ఎక్కడా పార్కింగ్ స్థలం లేదు. దీంతో వాహనదారులు విశ్రాంతికి, ఇతర అవసరాలకు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో అనుకోని విధంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది అమాయకులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. కొన్ని ఘటనల్లో మృతి చెందుతున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడకక్కడ వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాల్సిన బాధ్యత హైవే అధికారులదే.

– పొట్నూరు పృథ్వీరాజ్, కళింగకోమట్ల సంఘ ప్రతినిధి, గాంధీనగర్, నరసన్నపేట

అక్రమ గ్రావెల్ నీ స్కూల్ దగ్గర లేదంటే..

నేను రాజకీయాలు వదిలేస్తా..



సమావేశంలో మాట్లాడుతున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- బీజేపీ ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ సవాల్
- యూబీ పరిశ్రమ ద్వారా నెలకు రూ.70 లక్షలు దోపిడీ వాస్తవం కాదా అని నిలదీత
- ఎచ్చెర్ల పరువు ప్రతిష్టలను దిగజార్చారని ధ్వజం

రణస్థలం: బీజేపీ ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తన ఇంటికి, స్కూల్‌కి మధ్యలో వేసుకున్న వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమం కాదంటే తాను రాజకీయాలు వదిలేస్తానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సవాల్ విసిరారు. ఎచ్చెర్ల వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్ఈఆర్ అసెంబ్లీకే మచ్చ తెచ్చేలా మాట్లాడారని, ప్రజా సమస్యలు ప్రస్తావించాల్సిన జీరో అవర్‌లో తన వ్యక్తిగత సమస్యలను ప్రస్తావించి నియోజకవర్గం పరువు దిగజార్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రావెల్ గొడవలు జరుగుతున్నాయని, పక్కా అనుమతులు ఉన్న వారిపై కక్ష కట్టి కోట్లాది రూపాయల ఫైన్ వేయించారని ఆరోపించారు. హైవే పనులకు అక్రమంగా గ్రావెల్ విక్రయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లీజుదారుల నుంచి కొనుగోలు చేద్దామంటే ఎమ్మెల్యే ఒప్పుకోవడం లేదని హైవే ఉద్యోగులే చెబుతున్నారని తెలిపారు.

పరిశ్రమలకు బెదిరింపులు

'పైడిభీమవరంలోని శర్వాణి కాంక్రీట్ ప్లాంట్ యాజమానులను బెదిరించి ఎన్ఈఆర్ స్కూల్‌కు శ్లాబ్‌కు రూ.15 లక్షల విలువ గల కాంక్రీట్ ఉచితంగా వేయమన్నావ్. వినకపోతే అధికారులను పంపించి యాజమాన్యాన్ని బెదిరించారు. అప్పటికీ వినకపోతే అధికంగా పన్నులు వేయించావు. వాళ్లు గట్టి వాళ్లు కాబట్టే నీ బెదిరింపులకు లొంగలేదు. ఇలాంటి అరాచకాలు బయట పెడుతున్న మీడియా, పత్రికలపైనా కేసు పెడుతున్నారు' అని కిరణ్‌కుమార్ మండిపడ్డారు.

యూబీ పరిశ్రమలో ముప్పై ఏళ్లుగా పని చేస్తున్న 70 మంది కార్మికులను తొలగించారని, వైఎస్సార్‌సీపీ అనుకూలంగా ఉన్నారని కార్మికుల ఉద్యోగాలు తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా అనుమతులు పొందిన లేబర్, రవాణా కాంట్రాక్టర్లను పంపించేసి తనకు అనుకులమైన వాళ్ల పేర్లతో పనులు చేయిస్తున్నారని, ఈ పనులన్నీ యూబీ హెచ్‌ఆర్ కృష్ణంరాజు అనే వ్యక్తి ద్వారా నడిపిస్తున్నారని తెలిపారు. లారీలు ట్రాన్స్‌పోర్ట్ చేసే కాంట్రాక్టర్లను బెదిరించి తన ట్రాన్స్‌పోర్టు లారీలను పెడుతున్నారని, ఇలా నెలకు రూ.70 లక్షలు పైచిలుకు దోచుకుంటున్నారని ఆరోపించారు. తప్పుడు పనులు చేసి భగవంతుడి మీద ప్రమాణాలు చేయకూడదన్నారు. ఎన్‌హెచ్–16లో భాగంగా చేస్తున్న ఫ్లై ఓవర్ హైవే కాంట్రాక్టులన్నీ ఆయనే చేస్తున్నారని, రోలర్, లారీ, ట్రాక్టర్లు అన్నీ అతనివే పెడుతున్నారని, లేదంటే హైవే కాంట్రాక్టర్లును బెదిరిస్తున్నారని తెలిపారు. తమ నియోజకవర్గాన్ని తాము కాపాడుకుంటామని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, నాయకులు మీసాల వెంకటరమణ, డోల వెంకటరమణ, రొక్కం బాలకృష్ణ, మీసాల సీతంనాయుడు, దన్నాన రాజీనాయుడు, బొర సాయిరామ్, బవిరి రమణ, టేకు బ్రహ్మాజీ, ముద్దాడ రాజశేఖర్, కుప్ప రమణ, గొర్లె రామునాయుడు, గోవిందాసు సాయి తదితరులు ఉన్నారు.

భారీ వర్షానికి నేలకొరిగిన కటౌట్లు



వర్షానికి కూలిన కటౌట్

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన భారీ ఆర్చీ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రహదారిపై విద్యుత్ అలంకరణతో పెద్ద చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన భారీ కటౌట్ మంగళవారం మధ్యాహ్నం కురిసిన వానక కూలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పరిధిలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు (డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లు) ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం 'అప్రెంటిస్‌షిప్ఇండియా.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు అక్టోబరు 16న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా వి.టి.అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఇప్పటికే అప్రెంటిషిప్ పూర్తి చేసిన అభ్యర్థులు అనర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08922–294906 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి



పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో సూదికొండ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మద్దిల శేఖర్ (40) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిల శేఖర్ మంగళవారం పలాస ఐ.టి.టి.నగర్‌లోని భవన నిర్మాణ పనుల్లో పాల్గొన్నాడు. సున్నం వేసే క్రమంలో విద్యుత్ బల్బును మరొక గదిలోకి తీసుకెళ్లేందుకు వైరును పట్టుకోగా షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ ఏఎస్‌ఐ గణపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శేఖర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎచ్చెర్ల సీడీపీఓకు షోకాజ్ నోటీసు

- పౌష్టికాహారం సరఫరాదారు నుంచి కమీషన్ కోసం వేధింపులు
- సీడీపీఓతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ పైనా చర్యలకు జేసీ ఆదేశం



శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఎచ్చెర్ల చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) డోల పోలినాయుడుకు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ షోకాజ్ నోటీసు జారీచేశారు. ఆయనతో పాటు అక్కడే పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసరావుపైనా చర్యలకు ఆదేశించారు. వీరిద్దరూ కమీషన్ల కోసం వేధిస్తున్నారంటూ పైడి వెంకటరమణ అనే వ్యక్తి సోమవారం జరిగిన పీజీఆర్ఎస్(గ్రీవెన్స్)లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీడీపీఓ, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు వెంకటరమణ సమక్షంలో జేసీ మంగళవారం విచారణ చేపట్టారు.

ఏం జరిగిందంటే..

ఎచ్చెర్ల ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లకు బాలామృతం ప్యాకెట్లు సరఫరా చేసే రవాణా కాంట్రాక్టును పైడి వెంకటరమణ అనే వ్యక్తి తీసుకున్నాడు. ఎనిమిదేళ్లుగా ఇతనే ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది అగ్రిమెంట్ 2026 మార్చి వరకు ఉంది. ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల పరిధిలోని 116 అంగన్‌వాడీ సెంటర్లకు ఒక్కో బాలామృతం ప్యాకెట్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం రవాణా చార్జీ కింద ప్యాకెట్‌కు రూ.5 చొప్పున చెల్లిస్తుంది. ఇటీవల 14 నెలల బిల్లులు సుమారు రూ.1,75,000 విడుదలయ్యాయి. ఇందులో ప్యాకెట్‌కు 0.75 పైసలు వంతున అంటే సుమారు రూ.40 వేలు లంచంగా ఇవ్వాలని సీడీపీఓ, డేటా ఎంట్రీ ఆపరేటర్ డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇవ్వలేనని, తనకు వీలైనంత ఇస్తానని వెంకటరమణ చెప్పినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సెప్టెంబర్ నెల బాలామృతం ప్యాకెట్ల స్టాక్ వచ్చినప్పుడు ఆ విషయం చెప్పకుండా సీడీపీఓ వేరే వ్యక్తితో సరఫరా చేయించారు. దీంతో బాధితుడు వెంకటరమణ తన వద్ద ఉన్న సంభాషణల రికార్డులు, పూర్తి ఆధారాలతో ఈ నెల 22న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు.

వాస్తవమే..

విచారణ అనంతరం జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారు చేసిన అర్జీ వాస్తవమేనని చెప్పారు. సీడీపీవో పోలినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసరావులు బాధ్యులని విచారణలో తేలిందన్నారు. ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. నివేదికలు సిద్ధం చేయాల్సిందిగా ఐసీడీఎస్ పీవో విమలను ఆదేశించామని, అవి వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గతంలోనూ వివాదాస్పదమే..

సీడీపీఓ పోలినాయుడు గతంలో ఆమదాలవలస, ఇతర ప్రాజెక్టుల్లోనూ పనిచేశారు. అప్పట్లోనూ అవినీతిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు సస్పెండ్ చేశారు. ఈయనకు టీడీపీ నాయకుల అండ ఉండటంతో ఎన్ని విచారణలు చేసినా, అవినీతి రుజువైనా తప్పించుకుంటున్నారని ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

గంజాయితో మహిళ అరెస్టు



పట్టుబడిన మహిళ, గంజాయితో పోలీసులు

పలాస: ఒడిశా రాష్ట్రం రాయగడ బ్లాక్ మార్లబ గ్రామానికి చెందిన కిరణానందాను అనే మహిళ 8 ప్యాకెట్లలో 9.870 కిలోల గంజాయి తరలిస్తుండగా పలాస రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చెప్పారు. మంగళవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు తాపీ పనుల కోసం వెళ్లినప్పుడు అక్కడ పుతనందల్ విల్లుపురం గ్రామానికి చెందిన ఇ.బాలాజీ అనే వ్యక్తికి ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన సౌభాగ్య బడయానాయక్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తమిళనాడుకు గంజాయిని పంపించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గంజాయి పంపిస్తే రూ.10,000 ఇస్తానని చెప్పడంతో కిరణానందాను అనే మహిళా అంగీకరించింది. రెండు బ్యాగులతో పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకోగా కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. నిందితురాలి నుంచి గంజాయి, మొబైల్ ఫోన్, రూ.840 స్వాధీనం చేసుకున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



పద్దాన బాలకృష్ణ (ఫైల్)

కొత్తూరు: కురిగాం గ్రామానికి చెందిన పద్దాన బాలకృష్ణ (38) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. బాలకృష్ణకు ఒడిశా రాష్ట్రం కాశీనగర్‌కు చెందిన భాగ్యలక్ష్మితో 18 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. బాలకృష్ణ తాపి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. బాలకృష్ణ తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకవడంతో భార్య అలిగి నెల రోజుల క్రితం పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో బాలకృష్ణ మనస్తాపం చెంది ఈ నెల 22న ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. స్థానికులు గమనించి స్థానిక సీహెచ్‌సీకి తీసుకురాగా, పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 22వ తేదీ రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కోటేశ్వరరావు తెలిపారు.

ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి భర్తీకి చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐవైఎఫ్ ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులు పెరిగారని చెప్పారు. డీఎస్సీ మినహా ఏడాదిన్నరగా పోస్టులు భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3000 భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బి.సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితులకు త్వరగా పరిహారం అందించాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు కుటుంబంలో వ్యక్తులను కోల్పోయి ఎంతో కష్టంలో ఉంటారని వారికి పరిహారం విషయంలో అలసత్వం వహించవద్దని సూచించారు. పెండింగ్ కేసులపై ఆర్‌డీఓ సిబ్బంది త్వరగా విచారణ పూర్తి చేసి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ పెండింగ్ కేసుల వివరాలు వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబును కలిసిన పార్టీ నేతలు



కన్నబాబుతో వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును జిల్లాకు చెందిన పార్టీ కాళింగ కుల విభాగం రాష్ట్ర కార్యదర్శి, కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావులు కాకినాడలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు.

డెమో.. వామ్మో!

- అక్రమాలకు వెనక్కి తగ్గేది లేదంటూ చర్యలు
- లేనివి ఉన్నట్టుగా సర్టిఫికేషన్లు జారీ
- తద్వారా భారీగా లోన్లు పెట్టుకునేలా ఒప్పందాలు
- వాటాల మయంగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం



అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలోని కీలక విభాగాల్లో కొందరు అధికారుల తీరు విస్తు గొలుపుతోంది. ముఖ్యంగా డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా విభాగం (డెమో)లో ఓ అధికారి వ్యవహరిస్తున్న తీరు, ఆయనకు వత్తాసు పలుకుతూ తన వాటా డోస్‌ను పెంచుకుంటున్న కీలక అధికారి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వివిధ రకాల ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను సర్టిఫికేషన్ విషయంలో రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్న డెమో విభాగ ప్రముఖులు ఇందులో వాటాగా కీలక అధికారికి కూడా ఎంతో కొంత ఇస్తూ ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు. అయితే ఇంకో కోణంలో ఈ విభాగాధికారులు చేస్తున్న అక్రమాలు చూస్తే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ఉన్నవి లేనట్లుగా లేనివి ఉన్నట్లుగా చూపించి బ్యాంకు అధికారులకు కూడా టోపీ పెట్టేలా ఈ డెమో విభాగ ప్రతినిధులు స్కెచ్ వేసి అంతా సక్సెస్ అయ్యాక వాటాల బేరాలకు తెర తీస్తున్నారు. తప్పులకు దన్నుగా ఉన్నందుకు కీలక అధికారికి కూడా వాటాను కేటాయించడంతో ఏ మాత్రం వ్యవహారం బయటకు రాకుండా అక్రమాలు కొనసాగుతున్నాయి.

లోన్ల కోసం లేని పరికరాలు ఉన్నట్లుగా..

జిల్లాలో చాలా మంది వైద్య వ్యాపారంలో భాగంగా ప్రైవేటు ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, వివిధ సామర్థ్యాలతో నర్సింగ్ హోమ్‌లను ప్రారంభిస్తున్నారు. గత ఐదారేళ్లుగా జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో ప్రైవేటు సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు నెలకొల్పారు. అయితే వీటిని ప్రతి మూడు నెలలకు, ఆరునెలలకు తనిఖీల పేరిట ఒక్కో ప్రోగ్రాం ఆఫీసర్‌తో కలిసి బృందంగా డెమో విభాగం వెళ్లి ప్రభుత్వ రుసుంతో పాటు తమ జేబులు కూడా నింపుకుంటూ వస్తున్నారు. ఎక్కడైనా మాట వినని పరిస్థితి ఎదురైతే నెగెటివ్ రిపోర్టు రాసేలా చర్యలుంటాయి. కేవలం బ్యాంకు రుణాలకు గాను కొందరు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తే వారికి అనుకూలంగా అన్ని పరికరాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నట్టుగా సర్టిఫికేషన్ చేసి ఆ పార్టీ నుంచి రూ.లక్షల్లో దోచేస్తున్నారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో ఓ ల్యాబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లుగా అందులో ఆధునిక పరికరాలున్నట్లుగా (వేరే ప్రముఖ క్లినిక్‌ల ఫొటోల ఆధారాలతో) సర్టిఫికేషన్ చేసేసి బ్యాంకు రుణాలకు సహకరిస్తున్నారనే చర్చ సాగుతోంది. కానీ ఆ ఏరియాలో ఆ పేరుతో ఎలాంటి ల్యాబ్ గానీ స్కానింగ్ సెంటర్ గానీ లేదు. బ్యాంకులను సైతం తప్పుదోవ పట్టించి సుమారు రూ.50 లక్షలకు మించి రుణాలకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇటీవల జిల్లాలో నాలుగైదు ప్రైవేటు ల్యాబుల నుంచి పలు బ్యాంకులకు రుణాలిప్పించే బాధ్యతలను కూడా ఈ విభాగమే తీసుకుందనే చర్చ జోరందుకుంది. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమ వ్యవహారాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయని వైద్య శాఖలో చర్చ సాగుతోంది.